క్లుప్తంగా

ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు



మాట్లాడుతున్న వైద్యులు లియోన

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి రూరల్ మండలం పెట్లూరులో గురువారం స్విమ్స్ ఆధ్వర్యంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. జీకే పల్లి పీహెచ్‌సీ వైద్యుడు లావణ్య మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా బీపీ, షుగర్, నోటి క్యాన్సర్, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్‌స్మియర్ పరీక్షలు చేసినట్టు తెలిపారు. అలాగే శుక్రవారం చెలికంపాడు, ఉప్పరపల్లి గ్రామాల్లో ఉచిత వైద్య పరీక్షలు చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు పద్మావతి, చైతన్య భాను, సర్పంచ్ సక్కుబాయమ్మ, శ్రీశబరి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడా పోటీలకు రోసనూరు విద్యార్థి



విద్యార్థి ముత్యాలయ్యను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెళ్లకూరు: మండలంలోని రోసనూరు జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి కాగితాల ముత్యాలయ్య జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. బాలుడు శుక్రవారం నుంచి 23 వరకు మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పాల్గొంటున్నట్టు తెలిపారు. ముత్యాలయ్యను ఉపాధ్యాయులు చంద్రయ్య, భువనశంకర్, రవి, వెంకట్రాయలు, వీరరాఘవులు, రెజ్లింగ్ కోచ్ ఉదయ్‌కుమార్ అభినందించారు.

కుష్టు వ్యాధిగ్రస్తులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు, లుంగీలు, టబ్‌లు ఇస్తున్న అధికారులు

రాపూరు: మండలంలోని రావిగుంటపల్లి సమీపంలోని లెప్రసీ కాలనీలోని కుష్టు వ్యాధిగ్రస్తులకు జిల్లా కుష్టు నివారణ అధికారులు గురువారం దుప్పట్లు, లుంగీలు, టబ్‌లు అందజేశారు. వేపినాపి పీహెచ్‌సీ వైద్యాధికారిణి ప్రమీలా రాజకుమారి మాట్లాడుతూ కుష్టు వ్యాధిగ్రస్తులకు చెప్పుల కోసం కొలతలు తీసుకున్నారని, వాటిని సైజుల వారిగా తయారు చేయించి అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో కుష్టు నివారణాధికారులు మోహన్‌రావు, నరసింహం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి వైద్య శిబిరానికి వచ్చిన రోగులు

చిల్లకూరు : గూడూరు పట్టణంలోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పెళ్లకూరు మండలానికి చెందిన చాగణం లలితమ్మ, భాస్కరరావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన వెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి వైద్యులు రోగులకు వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఉచితంగా మందులు, కంటి అద్దాలు అందజేసినట్టు ట్రస్టు ఏవో క్రిష్ణ తెలిపారు.

సాకులతో తల్లికి పంగనామం

విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు. పేదరికాన్ని రూపుమాపవచ్చు. పేదల జీవన ప్రమాణాన్ని మెరుగు పరచవచ్చు. ఈ విషయాన్ని గుర్తించిన వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తల్లులకు ఆసరాగా ఉండేలా అమ్మ ఒడి పథకాన్ని తీసుకువచ్చారు. పిల్లలను బడికి పంపించే తల్లి బ్యాంకు ఖాతాలో రూ.15 వేలు జమ చేశారు. ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా తల్లికి వందనం పేరుతో ఇంట్లో వున్న పిల్లలందరికీ రూ.15 వేల చొప్పున ఇస్తానని చెప్పింది. కుంటి సాకులు చూపి ఎంతోమందికి పథకం అందకుండా చేసింది. అర్హత వున్న తల్లిదండ్రులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి తమకు విధి విధానాలు రాలేదని, పాఠశాలలో సంప్రదించాలని అధికారులు చెబుతుండడంతో ప్రజలు తలలు పట్టుకుంటున్నారు.

- తప్పుల తడకగా అర్హుల జాబితా
- రికార్డుల్లో భూమి ఉన్నట్టు వెల్లడి
- కార్యాలయాల చుట్టూ తల్లిదండ్రుల ప్రదక్షిణ
- పట్టించుకోని అధికారులు



తల్లికి వందనం అందని బాధితుల అర్జీలను పరిశీలిస్తున్న డీవీ సత్రం తహసీల్దార్ శైలకుమారి

దొరవారిసత్రం/చిల్లకూరు : పేద పిల్లల చదువులకు ఆసరాగా ఉండేలా అమలుచేస్తున్న తల్లికి వందనం పథకం పలువురికి అందలేదు. ఇందుకు పలు కారణాలను చూపుతున్నారు. అనర్హుల జాబితాలో వారు సూచించిన కారణాలను చూసి ప్రజలు అవాక్కవుతున్నారు. సాగు భూమి లేని వారికి అధికంగా భూమి ఉన్నట్లు, ఎకరా భూమి ఉన్నవారికి పదుల ఎకరాల కొద్దీ భూములు ఉన్నట్టు జాబితాలో నమోదు చేసి వుంది. అదేవిధంగా రేషన్ కార్డుల్లో పిల్లల పేర్లు, తల్లిదండ్రుల పేర్లు లేవని వుంది. ఆధార్ అనుసంధానంలో పేద కుటుంబాలకు భూములు ఉన్నట్లు చూపడం, పదుల సంఖ్యలో విద్యార్థులకు ఒకే ఆధార్‌ను అనుసంధానం చేయడం వంటివి విచిత్రాలు చోటు చేసుకున్నాయి. దొరవారిసత్రం మండలం అక్కరపాక, గొల్లపాళెం, సూరపు అగ్రహారం, వేణుంబాకం తదితర గ్రామాల్లో పదుల సంఖ్యలోని విద్యార్థులకు అర్హత ఉండి కూడా పలు కారణాలతో తల్లికి వందనం అందకుండా పోయింది. వారు రెవెన్యూ కార్యాలయంతోపాటు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. తప్పులను సరిచేయాలని కోరుతున్నారు. అలాగే



ఆధార్‌కు అనుసంధానమైన ఇతరుల భూములను తొలగించాలని అధికారికి విన్నవిస్తున్న బాధితులు

పలు పాఠశాలలకు చెందిన 31 మంది పిల్లల ఆధార్ కార్డుల్లో పేర్లు తప్పుగా ఉండడంతో తల్లికి వందనం అందలేదని, తప్పులను సరి చేసి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపినట్లు ఎంఈవో కృష్ణయ్య తెలిపారు. దొరవారిసత్రం మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో 4,607 మంది విద్యార్థులు తల్లికి వందనానికి దరఖాస్తు చేసుకోగా పలు కారణాలు చూపి 422 మందికి పథకం ఇవ్వలేదు.

ఒక పాఠశాలలో 310 మందికి అందని పథకం

చిల్లకూరు మండలంలోని తిక్కవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 310 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారిలో ఒక్కరికి కూడా తల్లికి వందనం అందలేదు. అలాగే మండలంలోని సిద్దవరం గ్రామానికి చెందిన 18 మంది విద్యార్థులకు కోట బీసీ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ దామవరపు బాబు పేరుతో ఆధార్‌ను అనుసంధానం చేశారు. దీంతో వీరికి నగదు బదిలీ కాలేదు. అలాగే గూడూరు మండలం వెందోడు గ్రామానికి చెందిన మొండెం వెంకటేశ్వర్లుకు ఐదుగురు సంతానం వుండగా పెద్ద బిడ్డ విష్ణుప్రియకు గత ప్రభుత్వంలో అమ్మ ఒడి పథకం వర్తించింది. ప్రస్తుతం ఒక్కరికి కూడా పథకం అందలేదు. సచివాలయానికి వెళ్లి అడిగితే వెంకటేశ్వర్లు ఆధార్‌కు నెల్లూరు జిల్లా మనుబోలు మండలం పర్లపాడులో 81 ఎకరాల భూమి అనుసంధానమైనట్టు చెప్పారు. తనకు ఎక్కడా సెంటు భూమి కూడా లేదని వెంకటేశ్వర్లు వాపోతున్నాడు. ఆధార్‌కు అనుసంధానంగా ఉన్న భూమిని తొలగించే విషయం రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళితే సంబంధిత యజమాని వేలి ముద్ర వేయాలని, లేకుంటే ఆధార్‌తోనే భూములు కనిపిస్తాయని చెప్పారు. ఇలా కూటమి ప్రభుత్వం పలు కుంటి సాకులు చూపి ఎంతోమందికి తల్లికి వందనం పథకాన్ని ఎగనామం పెట్టినట్టు స్పష్టమవుతోంది.

భూమి లేకపోయినా ఉందని చెబుతున్నారు



మాకు ఇద్దరు బిడ్డలు. వారికి తల్లికి వందనం వస్తుందని ఆశపడ్డాం. అర్హుల జాబితాలో పేరు లేదు. ఏమని అడిగితే ఎక్కువ భూమి ఉన్నట్లు రికార్డుల్లో ఉందని చెబుతున్నారు. మాకు భూములులేవని, తొలగించాలని తహసీల్దార్‌కు అర్జీ ఇచ్చాము.

- పీ సుప్రజ, అక్కరపాక, దొరవారిసత్రం

నాలుగు ఎకరాల మాగాణి ఉందని అంటున్నారు



మాకు ఎకరా భూమి వుంది. రికార్డుల్లో కుటుంబానికి నాలుగు ఎకరాల మాగాణి భూమి ఉందని చెబుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం వెళ్లి తొలగించుకువస్తే తల్లికి వందనం వస్తుందని సచివాలయం సిబ్బంది తెలిపారు. తర్వాత అయినా పథకం వస్తుందో రాదో..?

- బి.కవిత, కె.ఉషా, అక్కరపాక, సూరపుఅగ్రహారం, దొరవారిసత్రం

కార్మికులకు తల్లికి వందనం వర్తింపజేయాలి



బైక్ ర్యాలీ చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

వెంకటగిరి రూరల్ : మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ అండ్ ఫెడరేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు వడ్డిపల్లి చెంగయ్య డిమాండ్ చేశారు. ఆయన గురువారం కార్మికులతో కలిసి స్థానిక సీఐటీయూ కార్యాలయం నుంచి పట్టణంలో బైక్ ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న తల్లికి వందనం పథకం పారిశుద్ధ్య కార్మికులకు అందలేదని తెలిపారు. వారికి కూడా వర్తింపజేయాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. విచారణ జరిపి ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రామారావును బదిలీ చేసే వరకు మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

22న నెల్లూరులో విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర సదస్సు



రాష్ట్ర సదస్సు కరపత్రాలు ఆవిష్కరిస్తున్న విద్యుత్ ఉద్యోగులు సంఘం నాయకులు

నాయుడుపేట టౌన్ : విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ఈ నెల 22న నెల్లూరులో ఉద్యోగుల రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్టు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జాకీర్ హుస్సేన్, పెంచల ప్రసాద్ తెలిపారు. వారు గురువారం నాయుడుపేటలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు, సచివాలయాల్లో పనిచేస్తున్న జేఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగుల ప్రధాన సమస్యలపై సదస్సులో చర్చిస్తామన్నారు. అలాగే సచివాలయాల్లో పనిచేస్తున్న ఎనర్జీ అసిసెంట్లకు విద్యుత్ సంస్థ నియమ నిబంధనలను అమలు చేయాలని, వారిని విద్యుత్ సంస్థలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జ్యోతి, నాదముని రెడ్డి, జేఎల్ఎం ఉద్యోగులు సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసన్న కుమార్, అంబటి సుధీర్ బాబు, కంట్లాం రామయ్య, నజీబ్ ఖాన్ పాల్గొన్నారు.

తల్లికి వందనం దరఖాస్తు గడువు పెంచాలని వినతి



మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లాకు వినతి పత్రం అందజేస్తున్న అవాజ్ కమిటీ నాయకులు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని అనేక మందికి అర్హత ఉన్నా తల్లికి వందనం పథకం అందలేదని, దరఖాస్తు చేసుకోవడానికి గడువు పెంచాలని నాయుడుపేట ఆవాజ్ కమిటీ నాయకులు కోరారు. వారు గురువారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లాకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం వల్ల అనేక మంది నిరుపేదల పేర్లు అనర్హుల జాబితాలో పేర్లు వచ్చాయని తెలిపారు. పథకానికి అర్హత పొందేలా ధ్రువీకరణ పత్రాలను అధికారుల నుంచి తీసుకుని తిరిగి నమోదు చేసుకునేందుకు గడువు పెంచాలని కోరారు. ఆవాజ్ కమిటీ నాయకులు పఠాన్ హలీమ్ ఖాన్, షేక్ ఖాదర్ బాష, షేక్ అబ్దుల్లా, ఉస్మాన్, అబ్దుల్ గని తదితరులు పాల్గొన్నారు.

స్కూళ్ల విలీనంతో విద్యకు పిల్లలు దూరం




చిల్లకూరు : పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

- పాఠశాల ఎదుట తల్లిదండ్రుల నిరసన
- రెండు కిలోమీటర్లు నడిచి ఎలా వెళతారని ప్రశ్న

చిల్లకూరు : పిల్లలను రెండు కిలోమీటర్ల దూరంలో వున్న పాఠశాలలో విలీనం చేయడం తగదని పలువురు తల్లిదండ్రులు వాపోయారు. వారు గురువారం ఏరూరులో వున్న ప్రాథమికోన్నత పాఠశాల వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో 1 నుంచి 7వ తరగతి వరకు 130 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. దాన్ని కూటమి ప్రభుత్వం ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయడం సంతోషంగా ఉందన్నారు. పాఠశాలలో ఉన్న 1 నుంచి 5వ తరగతులకు చెందిన 36 మంది పిల్లలను అల్లిపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విలీనం చేయడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. తమ గ్రామం నుంచి అక్కడికి రెండు కిలోమీటర్లు ఉందని పేర్కొన్నారు. చిన్న పిల్లలు అంత దూరం ఎలా వెళతారని ప్రశ్నించారు. అంతేగాక అక్కడున్న గదులు 20 మందికి మాత్రమే సరిపోతాయని, మిగిలిన పిల్లలను ఆరుబయట కూర్చోబెట్టాల్సి వస్తుందని వివరించారు. అల్లిపురం వెళ్లే ప్రధాన రోడ్డులో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుందని తెలిపారు. పరిశ్రమలకు వెళ్లే భారీ వాహనాలతో పాటు నెల్లూరు, ముత్తుకూరు, వరగలి గ్రామాలకు ఆర్టీసీ బస్సులు తిరుగుతుంటాయని వెల్లడించారు. పిల్లలకు ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. అధికారులు స్పందించి పాఠశాలను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ పిల్లలను ప్రయివేటు పాఠశాలలకు పంపుతామని తెగేసి చెప్పారు. అనంతరం ఎంఈఓతోపాటు స్థానిక ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు.

బిడ్డల భవిష్యత్తును కాపాడాలని ధర్నా

పెళ్లకూరు: పాఠశాల విలీనంతో బిడ్డల జీవితం అంధకారమైందని, తమ బిడ్డల భవిష్యత్తును కాపాడాలని పలువురు తల్లిదండ్రులు వాపోయారు. వారు గురువారం ఎమ్మార్సీ వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ మండలంలోని చెంబడిపాళెం పాఠశాలలో చదువుతున్న 3, 4, 5 తరగతుల విద్యార్థులను ఎగువచావలి పాఠశాలలో విలీనం చేశారని తెలిపారు. చెంబడిపాళెం నుంచి ఎగువచావలికి పిల్లలు జాతీయ రహదారిలో వెళ్లాల్సి వుంటుందని పేర్కొన్నారు. వాహనాలు ఎక్కువగా వెళుతుంటాయని, పిల్లలకు ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. పిల్లలను తాళ్వాయిపాడు పాఠశాలలో చేర్చేలా అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో శిరీష, లక్ష్మీ, గీత తదితరులు పాల్గొన్నారు.



పెళ్లకూరు ఎమ్మార్సీ ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఏరులై పారుతున్న మద్యం

సైదాపురం : వెంకటగిరి నియోజకవర్గంలో బెల్టు షాపులను విచ్చలవిడిగా ఏర్పాటుచేసి మద్యం విక్రయాలను జోరుగా సాగిస్తున్నారు. దీంతో మందుబాబులు పూటుగా మద్యం సేవించి రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ పడిపోతున్నారు. నియోజకవర్గంలో 28 మద్యం షాపులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కూటమి నేతలు అధికారాన్ని అడ్డుపెట్టుకుని బెల్టు షాపులతోపాటు కూల్ డ్రింక్ షాపులు, హోటళ్లు, కిల్లీ కొట్లలో మద్యాన్ని విక్రయిస్తున్నారు. ఏ గ్రామానికి వెళ్లినా రెండు నుంచి 10 వరకు బెల్టు షాపులు ఉన్నాయి. మద్యం ఏరులై పారుతోంది. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు, పోలీసులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.





మద్యం మత్తులో పడిపోయిన మందుబాబులు

పాఠశాల ముందు నిలుస్తున్న మురుగు నీరు



పాఠశాల ముందు ప్రవహిస్తున్న మురుగు నీరు

చిట్టమూరు : మండలంలోని తంబుగారిపాళెం ప్రాథమిక పాఠశాల ముందు మురుగు నీరు నిలుస్తోంది. దీంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో సీసీ రోడ్డు వేసి కాలువలు నిర్మించలేదు. గ్రామంలోని మురుగు నీరు ప్రభుత్వ పాఠశాల ముందు నిల్వ వుంటోంది. అందులో దోమలు వృద్ధి చెందుతున్నాయి. పిల్లలు మధ్యాహ్నం భోజనం చేసే సమయంలో దోమలు అన్నంపై వాలుతున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. అలాగే ప్రహరీ గోడ కూడా లేకపోవడంతో గేదెలు, ఆవులు పాఠశాలలోకి వస్తున్నాయని చెబుతున్నారు. అధికారులు స్పందించి పాఠశాల ముందు మురుగు నీరు ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

కోట: ఆయిల్‌పామ్ సాగు లాభదాయకమని ఉద్యానశాఖ అధికారి ఎస్.సునీత తెలిపారు. ఆమె గురువారం కొత్తపాళెం రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటిన 36 నెలలకు మొదటి కోత ప్రారంభమవుతుందన్నారు. అనంతరం 25 సంవత్సరాల వరకు దిగుబడి వస్తుందన్నారు. ఆయిల్ పామ్ తోటల్లో అంతర పంటగా కూరగాయలు, పెసర, మినుము తదితర పంటలు సాగు చేసుకోవచ్చని వెల్లడించారు. సాగులో రైతులు మెళకువలు పాటించాలని సూచించారు. గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో ఆయిల్‌పామ్ సాగును పెంచేందు

యోగాంధ్రను విజయవంతం చేయాలి

కోట: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ జయజయరావు, ఎంపీడీవో దిలీప్‌కుమార్ కోరారు. వారు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో యోగాంధ్ర సన్నద్ధతపై సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలంలో సుమారు 140 చోట్ల యోగా కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఇందులో అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. ఎంఈవో మస్తానయ్య, సీడీపీవో మునికుమారి తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 35.956 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 35.956 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2,330, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 50, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

సైదాపురం ఎంఈవో-2కు డాక్టరేట్



డాక్టరేట్ పురస్కారం పొందిన సుప్రియ.

సైదాపురం : సైదాపురం ఎంఈవో-2 సుప్రియ ఎస్వీ యూనివర్సిటీ డాక్టరేట్ అందజేసింది. ఆమె ప్రొఫెసర్ ఉషారాణి ఆధ్వర్యంలో ఉమెన్ స్టడీస్ విభాగంలో ఇన్‌ఫ్లూయన్స్ ఆఫ్ హోమ్ అండ్ స్కూల్ ఎన్విరాన్‌మెంట్ ఆన్ ది వాల్యూస్ ఆఫ్ అడోలేసెంట్ గర్ల్స్- ఏ క్రాస్ కల్చరల్ స్టడీ అనే అంశంపై పరిశోధన చేశారు. ఆమెను పలువురు అధ్యాపకులు, ఉపాధ్యాయులు అభినందించారు.

మొక్కలతోనే మానవ మనుగడ

గూడూరు రూరల్ : మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని బీజేపీ నాయకులు కోరారు. వారు గురువారం గూడూరు రెండో పట్టణ పరిధిలోని నరసింగారావుపేటలో ఉన్న బీజేపీ కార్యాలయంలో వికసిత్ భారత్ సంకల్ప సభ నిర్వహించారు. పార్టీ గూడూరు అర్బన్ అధ్యక్షుడు దయాకర్ మాట్లాడుతూ గత 11 ఏళ్లలో భారత దేశం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. దేశ విద్రోహుల గుండెల్లో గుబులు పుట్టించేలా రక్షణ వ్యవస్థను పటిష్ట చేస్తున్నారని గుర్తు చేశారు. అనంతరం వారు మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు, నాయకులు బాలక్రిష్ణమనాయుడు, సురేంద్రరెడ్డి, సురేష్, శ్రీనివాసులు, బిందురెడ్డి, జీవీ నాయుడు, సునీల్‌కుమార్, బాలక్రిష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

సూళ్లూరుపేట రూరల్: అప్పు చెల్లించాలని ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు ఒత్తిడి చేయడంతో మనస్తాపం చెంది వ్యక్తి బుధవారం ఆత్మహత్యకు యత్నించాడు. ఈ విషయం ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. బాధితుడి కథనం మేరకు.. సూళ్లూరుపేటకు చెందిన శ్రీను 108 వాహనం పైలెట్‌గా పనిచేస్తున్నాడు. అతను ఒక ఫైనాన్స్ కంపెనీలో కొంత రుణం తీసుకుని తన భార్యకు వైజంక్షన్ సమీపంలో టిఫిన్ అంగడి పెట్టించాడు. దంపతులు ఇద్దరూ అనారోగ్యం బారిన పడడంతో కొద్ది రోజులుగా టిఫిన్ అంగడి నిర్వహించలేదు. తీసుకున్న అప్పు కట్టాలని ఫైన్సాన్ కంపెనీ ప్రతినిధులు ఒత్తిడి చేశారు. దీంతో మనస్తాపం చెందిన శ్రీను ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన స్థానికులు అతన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాణాప్రాయం లేదని వైద్యులు తెలిపారు. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

యోగాతో మానసిక ఒత్తిడి నియంత్రణ

చిల్లకూరు : ప్రస్తుత సమాజంలో మనిషి పని ఒత్తిడితో అనారోగ్యం బారిన పడుతున్నాడని, యోగా చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని నియంత్రించవచ్చని డీఆర్‌డబ్ల్యూ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు తెలిపారు. యోగా దినోత్సవంలో భాగంగా గురువారం గూడూరులోని దువ్వూరు రమణమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించార. ఆయన మాట్లాడుతూ రామచంద్ర మిషన్ హార్ట్ ఫుల్‌నెస్ ధ్యాన కేంద్రం సహకారంతో విద్యార్థినులకు యోగా నేర్పించినట్టు తెలిపారు. ప్రతిరోజూ యోగా చేయాలని సూచించారు.

యోగాపై అవగాహన ర్యాలీ

చిల్లకూరు : యోగా మనిషి జీవితంలో భాగం కావాలని ఎంఈవో -2 రవూఫ్ తెలిపారు. ఆయన గురువారం చిల్లకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని తెలిపారు. మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చన్నారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం వైజాగ్‌లో పెద్ద ఎత్తున యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో యోగాలో గ్రామీణ ప్రాంతం నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం జ్యోతి, పీడీ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు అప్పల చిననాయుడు, దుర్గా, శారద, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



జీవీపాళెంలో యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు, ప్రజలు



చిల్లకూరులో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, విద్యాశాఖాధికారులు



గూడూరు డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో యోగా చేస్తున్న విద్యార్థినులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

తడ: యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు. మండలంలోని బీవీపాళెం గ్రామంలోని పులికాట్ సరస్సు ఒడ్డున ఉన్న రిసార్ట్‌లో గురువారం మండల స్థాయి యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ప్రతిరోజూ యోగాసనాలు వేస్తే ఎన్నో ఉపయోగాలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో, తహసీల్దార్, ఎంఈవో తదితరులు పాల్గొన్నారు.